**Sakshi**

# గ్రూప్-2 దరఖాస్తుల గడువు పెంపు

## ఈ నెల 26 వరకు పొడిగించిన టీఎస్‌పీఎస్సీ

- భారీ వర్షాలతో ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోవడం వల్లే..
- 7.48 లక్షలకు చేరిన దరఖాస్తులు
- కొత్త దరఖాస్తులు 1.83 లక్షలు.. పాతవి 5.65 లక్షలు

సాక్షి, హైదరాబాద్

గ్రూప్-2 దరఖాస్తుల గడువును ఈనెల 26 వరకు పొడిగించినట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి పార్వతీ సుబ్రహ్మణ్యన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా నెట్‌వర్క్ దెబ్బతినడంతో ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయాయని, దీంతో దరఖాస్తు చేసుకోలేకపోయామని టీఎస్‌పీఎస్సీకి విజ్ఞప్తులు అందడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు ఉపయోగించుకోవాలని తెలిపారు. శుక్రవారం దరఖాస్తులకు చివరి తేదీ కావడంతో వేల మంది అభ్యర్థులు ఒకేసారి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ సర్వర్ డౌన్ అయింది. అనేక మంది అభ్యర్థులు దరఖాస్తు ఫారం పూర్తి చేసినా, ఫీజు చెల్లించి సబ్మిట్ చేయలేకపోయారు. అలాంటి వారంతా ఫీజు చెల్లించి దరఖాస్తులను సబ్మిట్ చేయాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు 1.83 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. మరోవైపు గతంలోనే గ్రూప్-2 కోసం దరఖాస్తు చేసుకున్న వారు 5.65 లక్షల మంది ఉన్నారు. దీంతో దరఖాస్తుదారుల సంఖ్య 7.48 లక్షలకు చేరుకుందని, 26 నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.